# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 21, జులై 2026


# సమిష్టిగా నిలబడి ఎల్‌నినోను ఎదుర్కొందాం

- రైతులు, ప్రజల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్ని శాఖలు మిషన్ మోడ్‌లో పనిచేయాలి
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి ఇల్లంబర్తి



**కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 20, ప్రభాతవార్త :**

ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో మిషన్ మోడ్‌లో పనిచేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల ప్రత్యేక అధికారి ఇల్లంబర్తి అధికారులను ఆదేశించారు. ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు, కంటింజెన్సీ ప్లాన్‌లను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా వర్షాభావ పరిస్థితులను ఎదుర్కోవచ్చని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్, నిర్మల్, కుమురం భీంఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన ఎల్‌నినో సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ప్రత్యేక అధికారికి జిల్లా కలెక్టర్లు, అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావాన్ని వ్యవసాయ రంగానికే పరిమితం చేయకుండా తాగునీరు, సాగునీరు, విద్యుత్, పశుసంవర్ధక, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, ఉద్యానవనం, భూగర్భ జలాలు, ఇరిగేషన్ తదితర అన్ని రంగాలపై ప్రభావం చూపే పరిస్థితిగా భావించి శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ గ్రామాన రైతులకు వర్షాభావ పరిస్థితులు, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించాలని, కందులు, పెసర్లు, నువ్వులు, వేరుశనగ, చిరుధాన్యాలు, ఉద్యాన పంటలను ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లాల వారీగా జలాశయాల నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి లభ్యత, సాగునీటి పరిస్థితులు, విద్యుత్ సరఫరా, పంటల స్థితిగతులను సమీక్షించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, ప్రజల్లో నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మున్సిపల్, తాగునీరు, విద్యుత్, వైద్యం, భూగర్భ జలాలు, ఇరిగేషన్, మహిళా శిశు సంక్షేమం, కృషి విజ్ఞాన కేంద్రం తదితర శాఖలు మిగతా 2లో..



### మధ్యాహ్న భోజన పథకాన్ని

# ప్రైవేట్ సంస్థలకు ఇవ్వొద్దు

- సీఐటీయూ డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా
- కనీస వేతనం రూ. 10 వేలు చెల్లించాలని డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పణ



**నస్పూర్, జూలై 20, ప్రభాతవార్త**

పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించే యత్నాలను తక్షణమే విరమించుకోవాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) డిమాండ్ చేసింది. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు ఇవ్వవద్దని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ వేణును కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అబ్బోజు రమణ, ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని స్వయంగా వండి పెడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులను పాఠశాలల నుండి వెళ్లగొట్టేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. గతంలో హనుమకొండ జిల్లాలో మిగతా 2లో..

# తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ డేవిడ్



**కెరమెరి, జూలై 20, ప్రభాతవార్త:**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ సోమవారం కెరమెరి తహసీల్దార్ (ఎంఆర్ఓ) కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలును పరిశీలించారు. కార్యాలయంలో కొనసాగుతున్న భూ భారతి దరఖాస్తుల స్వీకరణ, విచారణ, పరిష్కార ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిశీలించి అర్హుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అనంతరం ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన ఈకేవైసీ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఇంకా ఈకేవైసీ పూర్తి చేయని లబ్దిదారులను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఎవరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకుండా మిగతా 2లో..

# సర్ ప్రక్రియలో కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి

**ఆసిఫాబాద్, జులై 20, ప్రభాతవార్త :**

ఆసిఫాబాద్ పట్టణంలోని రోజ్ గార్డెన్‌లో ఆదివారం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్లమెంట్ అబ్జర్వర్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అర్హుడైన ఓటరికి ఓటు హక్కు దక్కేలా చూడటం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే బాధ్యత అని పేర్కొన్నారు. సర్ ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్‌ఏలు, అబ్జర్వర్లు, మండల కోఆర్డినేటర్లు ప్రతి గ్రామం, బూత్‌లో అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే వెంటనే పార్టీ దృష్టికి తీసుకురావాలని అన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ సర్ పేరుతో అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలిగించే ఏ ప్రయత్నాన్నైనా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. కేంద్రంలోని మిగతా 2లో..



# సమిష్టిగా నిలబడి ఎల్‌నినోను ఎదుర్కొందాం

(మొదటిపేజీ తరువాయి)

తమ యాక్షన్ ప్లాన్‌లు, కంటింజెన్సీ ప్రణాళికలను సిద్ధం చేసి అమలు చేయాలని ఆదేశించారు. ప్రస్తుత అంచనాల ప్రకారం 40-45 శాతం వరకు వర్షపాత లోటు నమోదయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు, ప్రజలను కాపాడుకోవడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజాప్రతినిధులు, అధికారులు, అన్ని శాఖల సిబ్బంది సమష్టిగా పనిచేస్తే ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోగలమని ప్రత్యేక అధికారి అన్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, ఫామ్ పాండ్ల ఏర్పాటుతో భూగర్భ జలాలను పెంచాలని సూచించారు. తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తూ, ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో సిల్టేషన్ తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు యూరియా బుకింగ్ యాప్‌లో నమోదు చేసుకుని అవసరమైన ఎరువులు పొందాలని సూచించారు. నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ, భూగర్భ జలాల పరిరక్షణకు సమష్టి కృషి అవసరమన్నారు. రైతులు 8 8 2 మీటర్ల ఫామ్ పాండ్లు ఏర్పాటు చేసి వర్షపు నీటిని భద్రపరచాలని, జిల్లాలో పెద్దఎత్తున నీటి సంరక్షణ చర్యలు చేపడితే భవిష్యత్ తాగునీటి, సాగునీటి అవసరాలను తీర్చవచ్చని తెలిపారు. కంది వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలను ప్రోత్సహించాలని సూచించారు. కుమురం భీంఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను చేరవేయాలని, అన్ని శాఖలు సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికలను అమలు చేయాలని, అత్యవసర పరిస్థితులకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వం మిషన్ మోడ్‌లో పనిచేస్తోందని, పత్తి సాగు దెబ్బతిన్న ప్రాంతాల్లో రైతులు కందులు, పెసర్లు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. నీటి నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ అవసరమైన సహాయక చర్యలు చేపడతామని తెలిపారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, తాగునీరు, సాగునీటి సమస్యల పరిష్కారానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. కడెం ప్రాజెక్టు నీటి నిల్వలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పైపులైన్ లీకేజీలను వెంటనే మరమ్మతు చేసి నీటి వృథాను నివారించాలని సూచించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ శాఖల యాక్షన్ ప్లాన్‌లు, కంటింజెన్సీ ప్రణాళికలను పవర్‌పాయింట్ ప్రజెంటే షన్ ద్వారా వివరించారు. అనంతరం ఎల్‌నినో బుక్‌లెట్, తెలంగాణ జలసిరి పోస్టర్లను ప్రత్యేక అధికారి, కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్. ఎస్ చిత్రు, బి. వెంకటేశ్వర్లు, పి. చంద్రయ్య, యువరాజ్ మర్మట్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్, క్యాతన పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ సంధ్యారాణి, చెన్నూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పి.పద్మ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ డేవిడ్

(మొదటిపేజీ తరువాయి)

చూడాలని అధికారులకు ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులపై కూడా ఆరా తీసిన ఆయన, అర్హుల దరఖాస్తులను నిబంధనల మేరకు వేగంగా పరిష్కరించాలని సూచించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా సేవలను సకాలంలో అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం అమలు తీరును కూడా సమీక్షించారు. ఇంటింటి సర్వే, ఓటరు వివరాల ధృవీకరణ, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అధికారులు సమన్వయంతో పనిచేసి అన్ని ప్రభుత్వ సేవలను ప్రజలకు వేగంగా అందించాలని అదనపు కలెక్టర్ డేవిడ్ సూచించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ నాగార్జున, డిప్యూటీ తహసీల్దార్ గేడం సంతోష్ కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటరు నమోదు సర్వేను వంద శాతం పూర్తి చేయాలి

- కోట్నాక గణపతి

**తిర్యాని, ప్రభాతవార్త, జూలై 20:**

తిర్యాని మండలంలోని ఉమ్మడి మంగి గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఓటరు నమోదు సర్వే దాదాపు తొంభై శాతానికి పైగా పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను కూడా అదే ఉత్సాహంతో పూర్తి చేసి వంద శాతం విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొట్నాక గణపతి పిలుపునిచ్చారు. సోమవారం ఉమ్మడి మంగి పరిధిలోని మంగి, ముల్కలమంద, కౌటాగాం, గోపర గ్రామాల్లో గ్రామ పంచాయతీ అధ్యక్షుడు రాయిసిడం వినోద్ కుమార్‌తో కలిసి ఆయన పర్యటించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఓటరు నమోదు సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కొట్నాక గణపతి మాట్లాడుతూ, ఇప్పటివరకు ఉమ్మడి మంగి పరిధిలో సర్వేను సమర్థంగా నిర్వహిస్తున్న బూతు స్థాయి అధికారులు మరియు బూతు స్థాయి ప్రతినిధులను అభినందించారు. ఆగస్టు 3వ తేదీతో సర్వే గడువు ముగియనున్నందున ఎలాంటి ఆలస్యం లేకుండా మిగిలిన ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఏ ఒక్క అర్హుడూ జాబితాకు దూరం కాకుండా చూడాలని అన్నారు. ప్రజలందరూ ఈ ప్రక్రియలో పూర్తిస్థాయిలో సహకరించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూతు స్థాయి అధికారి కొవ గీతాంజలి, బూతు స్థాయి ప్రతినిధులు అర్కా చిన్ను, అర్కా మలేష్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలిస్తున్న దృశ్యం

## కళాశాలను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే



### యువత ఉజ్వల భవిష్యత్తుకు హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు ఎంతగానో దోహదపడతాయి: మాజీ ఎమ్మెల్యే

**భైంసా, జులై 20, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని నిజామాబాద్ ప్రధాన రహదారి ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్మార్ట్ విజన్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. కళాశాల యాజమాన్యం ఆహ్వానం మేరకు ముధోల్ మాజీ శాసనసభ్యుడు భోస్లే నారాయణరావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరై, కళాశాల ప్రధాన కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా భోస్లే నారాయణరావు పటేల్ మాట్లాడుతూ.. పట్టణంలో నూతన హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఏర్పాటు కావడం విద్యాభివృద్ధికి, స్థానిక యువత ఉజ్వల భవిష్యత్తుకు ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలు మెండుగా ఉండే ఇలాంటి కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాలను ప్రారంభించిన శుభ సందర్భంగా యాజమాన్య నిర్వాహకులకు, అధ్యాపక బృందానికి ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్ చంద్రే, అరవింద్, రామచంద్రరావు, కళాశాల ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియలో కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజల తీర్పును ఎదుర్కొనే ధైర్యం లేక ఓటర్ల జాబితాలపై అనుమానాలు సృష్టించే రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసిన బిఎల్‌ఏలకు రాహుల్ గాంధీని కలిపిస్తానని సుగుణక్క పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, మాజీ జడ్పీ చైర్పర్సన్ సిడం గణపతి, జిల్లా డీసీసీ కార్యవర్గం సభ్యులు మల్లేష్, తారిక్, శోభన్ విజయ్, ముచద్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు ఇవ్వొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఈ పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే, వారు అందించిన భోజనం నాణ్యత లేక విద్యార్థులు తినలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దాగం రాజారాం మాట్లాడుతూ.. కనీస వేతనం కూడా ఇవ్వకుండా ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి కార్మికుడికి నెలకు రూ. 10,000 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎండి. రఫియా, కార్యదర్శి ఎండి. కరీమా మాట్లాడుతూ.. 60 సంవత్సరాల వయస్సు పైబడిన కార్మికులను ఎలాంటి పరిహారం ఇవ్వకుండా అకారణంగా తొలగించడం సరికాదన్నారు. పనుల నుంచి తొలగించే కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద రూ. 2 లక్షల ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు తక్షణమే స్పందించి మధ్యాహ్న భోజన పథకాన్ని యథావిధిగా కార్మికుల ద్వారానే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోమస ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు చల్లూరి దేవదాస్, అంబటి లక్ష్మణ్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు గడ్డం లక్ష్మి, సరిత, ఉమా, రమాదేవి, సవిత, కాంతమ్మ, సేపూరి లక్ష్మి, బుచ్చమ్మ, వరలక్ష్మి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలి

### నిర్మల్ పట్టణ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడికి పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి పిలుపు

**సారంగాపూర్, జులై 20, ప్రభాతవార్త:**

నిర్మల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం నిరంతరంగా కృషి చేయాలని జిల్లా జడ్పీటీసీల సంఘ అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. నిర్మల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన ఆకుల హరీష్ కుమార్ సోమవారం పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆకుల హరీష్ పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి ఆయనకు అభినందనలు తెలియజేస్తూ తిరిగి శాలువాతో సత్కరించారు. అనంతరం పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సద్వినియోగం చేసుకుంటూ, కార్యకర్తలను సమన్వయం చేసుకుని కాంగ్రెస్ బలోపేతానికి శ్రమించాలన్నారు. దీనిపై నూతన అధ్యక్షుడు ఆకుల హరీష్ స్పందిస్తూ.. తనపై నమ్మకంతో పట్టణ అధ్యక్ష పదవిని అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



# మేక వరప్రసాద్ సేవాస్ఫూర్తికి ఘన నివాళి..

**- మెగా రక్తదాన శిబిరం - అన్నదాన కార్యక్రమం విజయవంతం..**

**- స్వచ్ఛందంగా 55 మంది రక్తదానం... - సేవా కార్యక్రమాలను కొనియాడిన రెడ్ క్రాస్ ప్రతినిధులు**

**మంచిర్యాల, జులై 20, ప్రభాతవార్త**

దివంగత మేక వర ప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకొని వారి సేవాస్ఫూర్తిని స్మరించుకుంటూ సోమవారం మంచిర్యాలలోని తేజ ప్రయోగశాలలో మెగా రక్తదాన శిబిరంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వారి సతీమణి శ్రీవాణి, కుమార్తె వైద్యురాలు కుసుమశ్రీ, తేజ ప్రయోగశాల సిబ్బంది సేని సాయి, శివ ఆధ్వర్యంలో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా రక్తనిధి కేంద్రం సహకారంతో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా సుమారు 300 మందికి అన్నదానం నిర్వహించగా, 55 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చందూరి మహేందర్ మాట్లాడుతూ, దివంగత మేక వర ప్రసాద్ లయన్స్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి సమాజానికి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. వారి మరణానంతరం కూడా కుటుంబ సభ్యులు ప్రతి ఏడాది వారి జ్ఞాపకార్థం రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ ఏడాది మూడోసారి నిర్వహించిన రక్తదాన శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు. రక్తదానం చేసిన ప్రతి దాతకు, కార్యక్రమ నిర్వాహకులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చందూరి మహేందర్, రాష్ట్ర నిర్వహణ మండలి సభ్యుడు మధుసూదన్ రెడ్డి, కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్, లయన్స్ క్లబ్ సభ్యులు, రక్తనిధి కేంద్ర వైద్యుడు ప్రేమ్ సాయి, రక్తనిధి కేంద్ర సిబ్బంది, తేజ ప్రయోగశాల సిబ్బంది, స్వచ్ఛంద రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు



## వర్షాకాలంలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి: డాక్టర్ జాహ్నవి

**హాస్టల్ విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన**

**మందమర్రి, జులై 20, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలోని 2వ జోన్ ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహంలో డాక్టర్ జాహ్నవి ఆధ్వర్యంలో హాస్టల్ విద్యార్థులకు వర్షాకాలంలో పాటించాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జాహ్నవి మాట్లాడుతూ, వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, చర్మవ్యాధులు వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తడి దుస్తులు ధరించకుండా ఉండాలని, బహిరంగ ప్రదేశాల్లో లభించే ఆహార పదార్థాలను తీసుకోకూడదని తెలిపారు. శరీరంలో ఏవైనా అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదిస్తే వ్యాధిని ప్రారంభ దశలోనే పూర్తిగా నయం చేసుకోవచ్చని వివరించారు. అనంతరం సీజనల్ వ్యాధుల లక్షణాలతో బాధపడుతున్న విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



## రైతులు ఆయిల్ ఫామ్ పంటపై మొగ్గు చూపాలి

**చెన్నూరు మండల వ్యవసాయ అధికారిని ఎ. యామిని**

**చెన్నూరు, జులై 20, ప్రభాతవార్త**

వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు వరి పంటపైనే ఆధార పడకుండా ఇతర పంటలపై మొగ్గు చూపాలని మండల వ్యవసాయ అధికారిని యామిని రైతులకు సూచించారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని ఆస్నాద్ గ్రామంలో ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి పలురకాల పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు లాభదాయకంగా ఉండే పంటలను ఎంచుకొని సాగు చేయాలని, అందులో భాగమే ఆయిల్ ఫామ్ పంట కూడా ఒకటని, అందుకు రైతులు ముందుకు వచ్చి సాగు చేస్తే నాలుగు సంవత్సరాలలోపే కాపుకు వచ్చి రైతుకు మంచి లాభాలు వస్తాయన్నారు. గ్రామంలో ఆయిల్ ఫాం మొక్కలు నాటుతున్న సందర్భంగా వాటిని పరిశీలించి పలు సూచనలు చేశారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా అంతర పంటలను వేసే విధంగా రైతులు ముందుకు రావాలన్నారు. ఆయిల్ ఫామ్ లో అంతర పంటగా పెసర, మినుము, కంది, పత్తి వంటి పంటలు వేసుకొని లాభం పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్నాద్ ఏఈఓ శివరంజని, మ్యాట్రిక్స్ ఫీల్డ్ ఆఫీసర్ అరుణ్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి

**- అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా**

**సారంగాపూర్, జులై 20, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని తాండ్ర (జి), వైకుంఠపూర్ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను సారంగాపూర్ మాజీ జడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి సోమవారం పరామర్శించారు. తాండ్ర (జి) గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త జగత్ ప్రసాద్ తల్లి ఐదు రోజుల క్రితం మరణించగా, వైకుంఠపూర్ గ్రామానికి చెందిన కారోబార్ చుక్కబోట్ల రాజేశ్వర్ మూడు రోజుల క్రితం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. విషయం తెలుసుకున్న పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి వేర్వేరుగా ఆయా గ్రామాలకు వెళ్లి మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. వారి మరణం పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ.. బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైకుంఠపూర్ సర్పంచ్ జంగం ఆనంద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాధ ప్రశాంత్, పార్టీ నాయకులు గుర్రాల రాజేశ్వర్, చిన్నయ్య, మోహన్, లింగయ్య, గజానంద్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సాకీపల్లి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.





## బీఆర్ఎస్ యువ సంగ్రామ సభకు వస్తున్న ఆదరణ చూసి కాంగ్రెస్‌కు భయం

**- రెండేళ్లయినా నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు**

**- బీఆర్ఎస్ మండల కన్వీనర్ దేవి శంకర్**

**సారంగాపూర్, జులై 20, ప్రభాతవార్త:**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో యువ సంగ్రామ సభ విజయవంతం కావడంతో కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేకపోతోందని సారంగాపూర్ మండల బీఆర్ఎస్ కన్వీనర్ దేవి శంకర్ విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా ప్రజలకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయిందని మండిపడ్డారు. నిరుద్యోగులలో, ప్రజలలో బీఆర్ఎస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణను చూసి తట్టుకోలేక కాంగ్రెస్ నేతలు మతిలేని విమర్శలు చేస్తున్నారన్నారు. గతంలో సరూర్ నగర్‌లో నిర్వహించిన యూత్ డిక్లరేషన్ బహిరంగ సభలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సమక్షంలో రేవంత్ రెడ్డి నిరుద్యోగులకు సంవత్సరానికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్వే ప్రక్రియ తీరును పరిశీలించిన మార్కెట్ చైర్మన్ ఆనందరావు పాటిల్

**- సర్వే వంద శాతం పూర్తి చేసిన సర్పంచ్‌కు ఘన సన్మానం**

**భైంసా, జులై 20, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు భైంసా మండలంలోని పాంగ్రి గ్రామంలో జరుగుతున్న సర్వే ప్రక్రియను మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పాటిల్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో సర్వే ప్రక్రియను వంద శాతం విజయవంతంగా పూర్తి చేసిన గ్రామ సర్పంచ్ ఆకాష్ పాటిల్‌ను ఆయన శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పాటిల్ మాట్లాడుతూ.. ముధోల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాలలో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు నమోదయ్యేలా చూస్తూ, వంద శాతం ఓట్ల నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ప్రజా ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పనులు జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నాగోరావు, వార్డు సభ్యులు భోజరాం, విశ్వనాథ్, సాయిలు, మాజీ ప్రతినిధులు చాకటి దేవోజీ, కరండే అమృత్, జంగమే సాహెబ్ రావు, కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో భూ సర్వే అవగాహన

**చింతలమానేపల్లి, జులై 20, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని బాలాజీ అనుకోడ, రవీంద్రనగర్, కోర్సిని గ్రామ పంచాయతీలలో సోమవారం సమగ్ర భూ సర్వే అవగాహన గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రకాష్, ఎంపీడీవో సత్యనారాయణ మాట్లాడుతూ సర్వే ద్వారా భూములకు శాశ్వత రక్షణ లభించడంతో పాటు సరిహద్దు వివాదాలు తొలగిపోతాయని తెలిపారు. రైతులు ఈ ప్రక్రియకు సహకరించాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ దౌలత్ రావు, సర్వేయర్ శ్రీకాంత్ ,గిర్దావర్, జీపీఓలు, కార్యదర్శులు, స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

## - కంటి ఆపరేషన్‌కు 60 మందిని ఎంపిక చేసిన సిబ్బంది

**చెన్నూరు, జూలై 20 ప్రభాతవార్త**

చెన్నూరు పట్టణంలో యశోద బాయి, కిషన్ లాహోటి స్మారకార్థం చెన్నూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. కరీంనగర్‌లోని రేకుర్తి ఉదార నేత్ర వైద్యశాల వారి సౌజన్యంతో, వైస్ చైర్మన్ చిదురా సురేష్ సహకారంతో చెన్నూరులోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో ఈ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మందికి ఉచితంగా బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 60 మంది కంటి ఆపరేషన్‌కు అర్హులుగా ఎంపికైనట్లు రేకుర్తి ప్రతినిధి ప్రభాకర్ చెన్నూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిమ్మల సాగర్ తెలిపారు. ఎంపికైన వారిని రేకుర్తి ఆసుపత్రి ప్రత్యేక బస్సులో ఉచితంగా తరలించగా, మంగళవారం కంటి ఆపరేషన్లు నిర్వహించి, బుధవారం తిరిగి చెన్నూరుకు తీసుకురానున్నట్లు వెల్లడించారు. శిబిర నిర్వహణకు అయిన సుమారు రూ.15,000 వ్యయాన్ని చెన్నూరు ప్రముఖ వైద్యులు డాక్టర్ శంకర్ లాల్ లాహోటి సోదరుడు డాక్టర్ ఓం లాహోటి, తమ నానమ్మ యశోద బాయి, తాతయ్య కిషన్ లాహోటి జ్ఞాపకార్థం స్పాన్సర్ చేయడం అభినందనీయమని క్లబ్ అధ్యక్షులు నిమ్మల సాగర్, జోన్ చైర్‌పర్సన్ జాడి తిరుపతి అన్నారు. వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ శంకర్ లాల్ లాహోటి, రీజియన్ చైర్‌పర్సన్ లయన్ గుర్రాల చక్రాధర్, జోన్ చైర్‌పర్సన్ లయన్ జాడి తిరుపతి, జిల్లా కేబినెట్ సభ్యుడు లయన్ మోదుంపురం వెంకటేశ్వర్, క్లబ్ కార్యదర్శి లయన్ కప్ప ప్రతాప్ సింగ్, కోశాధికారి లయన్ సౌదం శ్రీనివాస్, సభ్యులు లయన్ సౌదం సంతోష్, లయన్ ఎన్నాం సతీష్, సామాజిక కార్యకర్తలు నిమ్మల విశాల, ముత్యాల శ్రావణి, కొమ్మెర నవీన్, రావుల మధుకర్, కోడిపెల్లి బాణయ్య, అమాన్, మోర్ల మధుకర్, పీహెచ్‌సీ సిబ్బంది బి. బాలు (హెచ్‌ఈఓ), డి. మహేందర్ (ఎంఎల్‌హెచ్‌పీ), ఆశా కార్యకర్తలు కె. లావణ్య, డి. రాధ, కె. బాలమణి, ఎం. కవిత తదితరులు పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలోనిర్వహించిన నేత్ర చికిత్స శిబిరం



## బెల్లంపల్లిలో ప్రధాన రహదారుల గుంతలకు మరమ్మతులు

**బెల్లంపల్లి, జూలై 20, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలోని ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టారు. బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి-రమేష్ బాబు ఆధ్వర్యంలో ఈ పనులు నిర్వహించబడ్డాయి. వర్షాకాలం కారణంగా రోడ్లపై ఏర్పడిన గుంతల వల్ల వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మున్సిపాలిటీ నిధులతో తక్షణ చర్యలు తీసుకొని మరమ్మతులు చేపట్టినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. ప్రస్తుతం ప్రజలకు ఇబ్బందులు లేకుండా తాత్కాలికంగా గుంతలను పూడ్చి సర్దుబాటు చేస్తున్నామని చెప్పారు. అలాగే త్వరలోనే సమస్యకు శాశ్వత పరిష్కారంగా నూతన రహదారి నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధి కార్యక్రమాలకు, రోడ్ల విస్తరణ పనులకు ప్రజలందరూ సహకరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్, జేసీబీ సీజ్

**చెన్నూరు, జూలై 20, ప్రభాతవార్త**

చెన్నూరు మండలం కాచనపెల్లి పెద్దవాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్, జేసీబి లను సీజ్ చేసినట్లు చెన్నూర్ టౌన్ సీఐ బన్సీలాల్ తెలిపారు. సోమవారం వేకువజామున పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో కాచనపెల్లి పెద్దవాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి అదే గ్రామనికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ నరిగే పున్నం, ఇసుక తోడేందుకు ఉపయోగించిన జెసిబి డ్రైవర్ ఎడ్ల సంపత్ లను పట్టుకొని విచారించి వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకొని వాహనాలను సీజ్ చేస్తామని సీఐ హెచ్చరించారు.



## ప్రతీ మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 20, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రజా లైఫ్ కేర్ ఆసుపత్రిలో ప్రతి మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సిర్పూర్ ఎమ్మెల్యే, ప్రజా బంధు ఫౌండేషన్ అధ్యక్షుడు డా. పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. శిబిరంలో కంటి శుక్లాలు, చూపు మందగించడం తదితర కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చికిత్స, శస్త్రచికిత్సపై సూచనలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శిబిరానికి వచ్చే వారు తప్పనిసరిగా ఓటరు గుర్తింపు కార్డు జిరాక్స్ రెండు ప్రతులు, ఆధార్ కార్డు జిరాక్స్ రెండు ప్రతులు, రేషన్ కార్డు జిరాక్స్ రెండు ప్రతులు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు వెంట తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం ప్రజా లైఫ్ కేర్ ఆసుపత్రి - 8008880802ను సంప్రదించవచ్చని తెలిపారు.



## ప్రైవేటీకరణ టెండర్లు రద్దు చేయాలని నిరసన

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 20, ప్రభాతవార్త :**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ విద్యుత్ విభాగ కార్యాలయం వద్ద సోమవారం విద్యుత్ ఉద్యోగులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. విద్యుత్ ఉత్పత్తి సంస్థకు చెందిన బొగ్గు బూడిద (కోల్ యాష్) ప్లాంట్ నిర్వహణను ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు అప్పగించేందుకు టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఈ ఆందోళన చేపట్టారు. టెండర్ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని, ఉద్యోగుల వేతన సవరణ కోసం వేతన సవరణ కమిటీ (పీఆర్‌సీ)ని తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రైవేటీకరణను ప్రోత్సహించే చర్యలు ఉద్యోగుల ప్రయోజనాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఉద్యోగుల హక్కులను పరిరక్షి ంచాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ కమిటీ జిల్లా చైర్మన్ వెంకటేష్, కన్వీనర్ ఎం.జి. సతీష్, డివిజనల్ ఇంజనీర్ నాగరాజు, సంయుక్త కార్యాచరణ కమిటీ నాయకులు చంద్రశేఖర్, మురళీధర్, జగన్‌మోహన్, రామకృష్ణ, రాజేష్, కిషన్, సుధారాణి, శ్రీనివాస్, రమేష్, భారతి, శంకర్, శేఖర్ తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ సురేష్

## అశోక్‌నగర్‌లో సిసి రోడ్డు పనులు ప్రారంభం

**తాండూర్, జూలై 20, ప్రభాతవార్త :**

తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని అశోక్ నగర్ లో సోమవారం సిసి రోడ్డు పనులను స్థానిక సర్పంచ్ ముడిమడుగుల సురేష్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అశోక్ నగర్ కాలనీలో గత కొన్నేళ్లుగా మురికి కాలువ వర్షపు నీరు, మురికి నీరు ఇళ్లల్లో చేరి స్థానికులు చాలా ఇబ్బందులు పడే వారన్నారు. మురికి కాలువ నిర్మాణంతో ప్రజలు ఇబ్బందులు తీరుతాయన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ, వార్డ్ మెంబర్, పట్టెం విష్ణు కళ్యాణ్, గ్రామపంచాయతీ ఈవో దివాకర్, నాయకులు సిరంగి శంకర్, ఎండి ఈసా, బానేష్, ప్రసాద్, బాబా, కాలనీ వాసులు పాల్గొన్నారు.



జెసిబితో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న దృశ్యం

## పిచ్చి మొక్కలు తొలగింపు

**తాండూర్, జూలై 20, ప్రభాతవార్త :**

తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని రచ్చబండ సమీప ప్రాంతంలో గల రహదారికి ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను సోమవారం జెసిబి సహాయంతో తొలగించినట్లు గ్రామ పంచాయతీ ఈవో దివాకర్ తెలిపారు. రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో నిత్యం రాకపోకలు సాగిస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. స్థానిక ప్రజల ఫిర్యాదుతో జెసిబి సహాయంతో పిచ్చి మొక్కలను తొలగించే పనులు చేపట్టామని ఈఓ తెలిపారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ కట్టుబడి పనిచేస్తుంది

**ఆసిఫాబాద్, జులై 20, ప్రభాతవార్త :**

ప్రజలకు చేరువగా ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు జిల్లా పోలీస్ శాఖ కట్టుబడి పనిచేస్తుందని జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా విని చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. ప్రజావాణిలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు చేశారు.



ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ నితికా పంత్

## మహిళ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న దోస్త్ ప్రక్రియ

**ఆసిఫాబాద్ టౌన్, జులై 20, ప్రభాతవార్త :**

ఆసిఫాబాద్ మండలం బూరుగూడ గ్రామ శివారులోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో దోస్త్ చివరి విడత ప్రవేశాల నమోదు ప్రక్రియ కొనసాగుతోందని సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డి. శారద ఒక ప్రకటనలో తెలిపారు. దోస్త్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ జులై 26 యని, ఇప్పటి వరకు దోస్త్ లో రేజిస్ట్రేషన్ చేసుకోని వారికి కూడా రేజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థినులు దోస్త్ ద్వారా రేజిస్ట్రేషన్ చేసుకొని కళాశాలలో సంప్రదించాలని సూచించారు. డిగ్రీలో ప్రవేశం పొందటానికి ఇదే చివరి అవకాశమని, ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. కళాశాలలో బిఏ బీకాం, సీఏ, బిజెడ్ సి ,ఎం జెడ్ సి, ఎంపీసీ, ఎంపీసీఎస్, కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా కళాశాలలో నాణ్యమైన ఉచిత విద్య, వసతి, భోజనం, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం,అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన, న్యాక్ వారిచే గుర్తింపు, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. గిరిజన మహిళా అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నెంబర్ 89786 28830 లో సంప్రదించవచ్చని ఆమె పేర్కొన్నారు.

# ఓటు హక్కు పరిరక్షణలో కాంగ్రెస్ బీఎల్‌ఏలు కీలక పాత్ర పోషించాలి

● బుద్దే విజయ్ కుమార్

**తిర్యాని, జూలై 20, ప్రభాతవార్త**



ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలిస్తున్న విజయ్ కుమార్

రాజ్యాంగం కల్పించిన విలువైన ఓటు హక్కు ప్రతి అర్హుడైన పౌరుడికి అందేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) ఓటు హక్కు పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ బుద్దే విజయ్ కుమార్ అన్నారు. సోమవారం తిర్యాని మండలంలోని నాయకపుగూడ, తలండి, విజయనగరం, గోయగం గ్రామాల్లో ఆయన పర్యటించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఏలు, పార్టీ నాయకులతో సమావేశమై ప్రక్రియ పురోగతిని తెలుసుకున్నారు. ఇప్పటివరకు సుమారు 85 శాతం పూర్తయిందని వారు వివరించారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, ఓటు హక్కుకు అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేయాలని బీఎల్‌ఏలకు ఆయన సూచించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే స్పందించి పరిష్కరించేలా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు చుంచు బాపురావు, శ్రీహరి, బుద్దే శేఖర్, బుద్దే వెంకటేష్, బీఎల్‌ఏ ముత్తె రామచందర్, బీఎల్‌వో మమత, శంకర్, చుంచు మల్లేష్, కుదిరి మల్లేష్, బుద్దే చిన్నయ్య, బుద్దే బనయ్యతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అనార్‌పల్లి వాగుపై వంతెన నిర్మాణానికి కృషి చేస్తా: ఆత్రం సుగుణక్క

**కెరమెరి, జులై 20. ప్రభాతవార్త:**

కెరమెరి మండలంలోని అనార్‌పల్లి వాగుపై శాశ్వత వంతెన నిర్మించాలని స్థానిక గ్రామస్తులు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కకు సోమవారం విన్నవించారు. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులతో కలిసి వాగును ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామస్తులు మాట్లాడుతూ..వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో అనార్‌పల్లి, పరిసర గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థులు, రైతులు, అత్యవసర వైద్య సేవలు పొందాల్సిన రోగులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనిసుగుణక్క దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ..ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్కకు ఈ సమస్యను వివరించి, అనార్‌పల్లి వాగుపై శాశ్వత వంతెన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు అయ్యేలా ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

**- టీఆర్‌టీఏఎఫ్ జిల్లా అధ్యక్షుడు దర్శనం దేవేందర్**

**సారంగాపూర్, జులై 20, ప్రభాతవార్త:**

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీఆర్‌టీఏఎఫ్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు దర్శనం దేవేందర్ డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన నిర్మల్ జిల్లా శాఖ తరఫున పలు కీలక సమస్యలను రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ ఇన్సూరెన్స్‌ను సహజ మరణాలకు కూడా వర్తింపజేయాలని, పాఠశాలల ప్రారంభ సమయాన్ని ఉదయం 9:30 గంటలకు మార్చాలని కోరారు. అలాగే పెండింగ్ జీపీఎఫ్, సీపీఎస్ బకాయిలు విడుదల చేయాలని, కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా సరిహద్దులకు దగ్గరగా ఉన్న మహారాష్ట్ర ఆసుపత్రులను ఈహెచ్‌ఎస్ పరిధిలోకి తీసుకురావాలని, ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. ఈ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని రాష్ట్ర కమిటీ హామీ ఇచ్చింది. ఈ కార్యక్రమంలో నాయకులు చిలుక సతీష్, కూరాడి చంద్రశేఖర్ పాల్గొన్నారు.




## చెన్నూరులో బీజేపీ శ్రేణుల సంబరాలు

**- శివకృష్ణకు యువమోర్చా జిల్లా అధ్యక్ష పదవి రావడంపై హర్షం**

**- శ్రమకు దగ్గ ఫలితంగానే అధ్యక్ష పదవి**

**- భాజపా మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్**



**చెన్నూరు, జూలై 20, ప్రభాతవార్త**

పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికి అధిష్టానం నుంచి ఎల్లప్పుడూ ఆశీస్సులు, అండదండలు ఉంటాయని, అందులో భాగంగానే శివకృష్ణకు యువమోర్చ జిల్లా అధ్యక్ష పదవి వచ్చిందని భాజపా జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణానికి చెందిన 18 వార్డు కౌన్సిలర్ ఏతం శివకృష్ణకు భాజపా అధిష్టానం యువమోర్చా మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగాచెన్నూరులో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు.

## విద్యార్థులకు సామాజిక అంశాలపై పోలీసుల అవగాహన

**సిర్పూర్(టి), జూలై 20, ప్రభాతవార్త :**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ నితికా పంత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు సిర్పూర్(టి) పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీసు కళాబృందం నూతన చట్టాలు, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాల నివారణ, షీ టీమ్స్ సేవలు, గంజాయి నిర్మూలన తదితర అంశాలపై పాటలు, ప్రదర్శనల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా ఎస్సై సాగర్ మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో అపరిచితుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ప్రభుత్వం, పోలీసు శాఖ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని చెప్పారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మూఢనమ్మకాలను విశ్వసించవద్దని, గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా 100 అత్యవసర సేవలకు సమాచారం అందించాలని కోరారు.

## అసత్య ఆరోపణలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**ఆసిఫాబాద్, జులై 20, ప్రభాతవార్త :**

తనపై అసత్య ఆరోపణలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంఆర్పీఎస్ నాయకుడు రేగుంట కేశవ్ రావ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంఆర్పీఎస్ నాయకుడు మాట్లాడారు. తనపై చేసిన భూకబ్జా, బెదిరింపులు, డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు పూర్తిగా అసత్యమని పేర్కొన్నారు. ఈ తప్పుడు ఆరోపణలతో తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాను గతంలో సామాజిక ఉద్యమాలు, తెలంగాణ రాష్ట్ర సాధన, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సాధన ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించానని, ఎలాంటి భూకబ్జాలకు పాల్పడలేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంఆర్పీఎస్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పొన్నాల నారాయణ, పిట్టల సత్యనారాయణ, లింగంపల్లి ప్రభాకర్, రాజలింగు, రేగుంట శ్రావణ్, రామిల్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## 26న కోదండరామ్ సభను విజయవంతం చేయాలి

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 20, ప్రభాతవార్త :**



ఈనెల 26న కాగజ్‌నగర్‌లో నిర్వహించనున్న తెలంగాణ జేఏసీ చైర్మన్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ సభను విజయవంతం చేయాలని సిర్పూర్ తాలూకా జేఏసీ కన్వీనర్ వి. కిషోర్‌కుమార్, తెలంగాణ ఉద్యమకారుల వేదిక కన్వీనర్ ఈర్ల విశ్వేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక పటేల్ గార్డెన్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 26 ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనానికి తెలంగాణ ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే సోమవారం నుంచి సిర్పూర్ తాలూకా తెలంగాణ జేఏసీ, ఉద్యోగ-ఉపాధ్యాయ జేఏసీ, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు తమ వివరాలను నమోదు చేసుకొని ఉద్యమకారుల జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. గుర్తింపు పొందిన ఉద్యమకారుల జాబితాను ఈనెల 26న కాగజ్‌నగర్‌లో జరిగే సభ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరామ్‌కు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జేఏసీ సహ కన్వీనర్, రిటైర్డ్ ఎంఆర్‌వో సుభాష్, తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు లింగారెడ్డి, ఏ. శ్రీనివాసరావు, కేశవ్, నాయకులు సి.పి. రాజ్‌కుమార్, తుమ్మ రమేష్, సిందం శ్రీనివాస్, దెబ్బటి శ్రీనివాస్, తాజ్‌బాబా, గోగర్ల కన్నయ్య, మున్సిపల్ కౌన్సిలర్ కావేటి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదు

**అధికారులను ఆదేశించిన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ - కలెక్టరేట్‌లో అర్జీల స్వీకరణ.. సమన్వయంతో పనిచేయాలని సూచన**



**నిర్మల్, జులై 20, ప్రభాతవార్త:**
ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు ఎలాంటి ఆలస్యం చేయకూడదని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయా శాఖల అధికారులు ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను అదనపు కలెక్టర్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) రాథోడ్ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతన శ్రేణి కోసం పోస్టుకార్డు ఉద్యమం



**సిర్పూర్(టి), జులై 20, ప్రభాతవార్త :**
తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిర్పూర్(టి) మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), మండల వనరుల కేంద్రం (ఎంఆర్‌సి)లో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులతో కలిసి సోమవారం పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు డి. హరీష్, ప్రధాన కార్యదర్శి కె. హరీష్ మాట్లాడుతూ కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రికి పోస్టుకార్డుల ద్వారా వినతిపత్రాలు పంపుతున్నట్లు తెలిపారు. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కనీస వేతన శ్రేణి (మినిమం టైమ్ స్కేల్) అమలు చేయాలని, వారి సేవలను క్రమబద్ధీకరించాలని, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సెలవు సౌకర్యాలు కల్పించాలని, వార్షిక వేతన పెంపు (ఇంక్రిమెంట్), ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని, సంరక్షక సిబ్బంది (కేర్‌టేకర్లు)ను నియమించాలని, సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపట్టినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల నాయకులతో పాటు నిర్వహణ సమాచార వ్యవస్థ (ఎంఐఎస్) ఉద్యోగి ప్రశాంత్, కేజీబీవీ ప్రత్యేక అధికారి నాగసుధ, కేజీబీవీ సిబ్బంది, సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

# భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలి

**- బోనాల కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేష్**



**కాగజ్‌నగర్ రూరల్, జులై 20, ప్రభాతవార్త :**
ఆగస్టు 2న నిర్వహించనున్న శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు బోనాల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాల కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేష్ మాట్లాడుతూ జాతరకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు భక్తులకు తాగునీటి సౌకర్యం, ప్రసాదాల పంపిణీ, క్యూలైన్ల నిర్వహణ తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని అన్నారు. అలాగే బోనాల శోభాయాత్ర ప్రశాంతంగా, సజావుగా జరిగేలా భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బోనాల నిర్వహణలో కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు చింతలమణి రాజ్‌కుమార్, వల్లాల సోమనాథం, బడుగు వీరస్వామి, శ్రీనివాస్, వెంకటేష్, సదానందం, రాము, గణేష్, రమేష్, రవీందర్, శ్రీనివాస్, శివకుమార్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

**ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం: బాసర సీఐ దీపక్**

**సావర్గం గ్రామంలో అవగాహన సదస్సు.. సర్పంచ్‌తో కలిసి మొక్కలు నాటిన సీఐ**



**భైంసా, జులై 20, ప్రభాతవార్త:**
పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అలాగే గ్రామాల భద్రత కోసం ప్రతి ఊరిలోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని నిర్మల్ జిల్లా బాసర రూరల్ సీఐ దీపక్ పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని సావర్గం గ్రామాన్ని సందర్శించిన ఆయన, గ్రామస్థులకు సీసీ కెమెరాల ప్రాధాన్యంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ దీపక్ మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానంగా పనిచేస్తుందన్నారు. ప్రతి గ్రామం, ఇల్లు, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాల నియంత్రణతో పాటు భద్రత మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. ఎక్కడైనా నేరాలు లేదా అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు నిందితులను త్వరగా గుర్తించి పట్టుకోవడంలో సీసీ కెమెరా విజువల్స్ కీలక ఆధారాలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామాల రక్షణ కోసం ప్రజలంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ ఆనంద్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. ప్రకృతిని కాపాడుకోవడం మనందరి బాధ్యతని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాధవ్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, యువకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు

# చందలూరి కుమార్ కుటుంబానికి రూ.లక్ష ఎల్ఓసీ అందజేసిన ఎమ్మెల్యే

**నస్పూర్, జులై 20, ప్రభాతవార్త**
అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్న మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32వ డివిజన్‌కు చెందిన చందలూరి కుమార్ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.1,00,000 విలువగల ఎల్ఓసీ మంజూరైంది. ఈ పత్రాన్ని బాధితుడి కుటుంబ సభ్యులకు మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు సోమవారం స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి వర్గాలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ నిధులను మంజూరు చేస్తోందన్నారు. అత్యవసర సమయంలో ఈ ఎల్ఓసీ ఎంతగానో ఉపయోగపడుతుందని, కుమార్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితుడి కుటుంబానికి అన్ని వేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్, టీపీసీసీ సభ్యులు, నస్పూర్ పట్టణ ఇన్‌చార్జ్ నూకల రమేష్‌తో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లిలో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



**బెల్లంపల్లి, ప్రభాతవార్త**
బెల్లంపల్లి పట్టణంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరోక ముఖ్యమైన అడుగు పడింది. బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో యుఐడిఎఫ్ నిధులు రూ.15 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన సీసీ రోడ్డు పనులకు ఘనంగా శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి-రమేష్ బాబు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో రహదారుల అభివృద్ధి, పారిశుద్ధం, తాగునీటి సదుపాయాలు వంటి మౌలిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సదుపాయం కల్పించడం, వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా చూడడం లక్ష్యంగా సీసీ రోడ్ల నిర్మిస్తున్నామని తెలిపారు. అలాగే స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు స్పందిస్తూ అభివృద్ధి కార్యక్రమాలకు కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. ఈ రహదారి నిర్మాణంతో వార్డులోని నివాసితులకు పెద్ద ఎత్తున ఉపశమనం లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ పీక ఎల్ల బాయ్, జంగం కల్పనగోస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కంకటి శ్రీనివాస్, పీక లక్ష్మణ్, నీలీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సారంగాపూర్ మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా సాయన్న

**సారంగాపూర్, జులై 20, ప్రభాతవార్త:**



సారంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మండలంలోని బీరవెల్లి గ్రామానికి చెందిన బ్యాగరి సాయన్న నియమితులయ్యారు. నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ ఆశీస్సులతో, ఎస్సీ విభాగం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు కట్ట శ్యామ్, ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి కొంతం గణేష్ ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది. ఈ సందర్భంగా సోమవారం నూతన అధ్యక్షుడు బ్యాగరి సాయన్న సారంగాపూర్ మండల మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి నూతన అధ్యక్షుడికి శాలువా కప్పి, మిఠాయి తినిపించి అభినందనలు తెలియజేశారు. అనంతరం పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. మండలంలో ఎస్సీ విభాగం ద్వారా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేయాలన్నారు. దీనిపై బ్యాగరి సాయన్న స్పందిస్తూ.. తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించినందుకు జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలుపుకుంటూ మండలంలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మాసిరుద్దీన్, ప్రేమ నందు, గుర్రాల రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సాకపల్లి సురేందర్, నాయకులు ముజ్జు, కృష్ణ, అస్లాం, రాకీ తదితరులు పాల్గొన్నారు.